నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- ఎమ్మెల్యే ఎలీజా
- మైసన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం రూరల్: నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందని, పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని మైసన్నగూడెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు, ప్రజలకు అవసరయ్యే అనేక నూతన పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, ఇంకా ఏమైనా ప్రజలకు అవసరాలు ఉన్నాయా అని తెలుసుకుంటున్నామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో టీడీపీకి చెందిన వారికే, అదీ జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు అందేవని, ప్రస్తుత ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం తీర్చిదిద్దిందని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.కోట్ల నిధులను కేటాయించిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎంతో ఆదరణ లభిస్తోందని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కావాలని కోరుకుంటున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వ పాలన చేస్తుంటే, ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధిస్తారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ సింగుదాసు హైమావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, ఉప సర్పంచ్ పిల్లి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు జుజ్జూరి సత్యనారాయణ, గంజి వినోద్, కనపర్తి శ్రీనివాస్, వల్లూరి శ్రీకాంత్, చీమల మురళీ పాల్గొన్నారు.


మైసన్నగూడెంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


కన్నాపురంలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

ప్రజలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం

కొయ్యలగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికలు ప్రజలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అని ప్రజల వైపు నిలబడిన ఒకే ఒక్కడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే పెత్తందారులుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, రామోజీ, వేమూరి రాధాకృష్ణ నిలిచారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కన్నాపురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అమరావతే రాజధాని కావాలంటున్న చంద్రబాబు అక్కడ స్థిర నివాసం ఎందుకు ఏర్పరుచుకోలేదని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి కోరుకుంటున్న ముఖ్యమంత్రి ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలోనే అమరావతిలో సొంత స్థిర నివాసం ఏర్పరచుకున్నారన్నారు. రాష్ట్రం విడిపోయిన అనంతరం కూడా చంద్రబాబునాయుడు జూబ్లీహిల్స్‌లోనే నివాసం ఉంటున్నారని అన్నారు. అధికారం ఉంటే అమరావతి, లేదంటే హైదరాబాద్ అనే సిద్ధాంతం చంద్రబాబుది అన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా అని పరోక్షంగా పవన్ కల్యాణ్ పేర్కొనడంతో జనసేన పార్టీ శ్రేణులే అయోమయంలో పడ్డారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పచ్చ మీడియా విషపు రాతలు రాస్తున్నాయన్నారు. వైఎస్సార్ సీపీకి మళ్లీ అధికారం అప్పగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. పథకాల అమలు తీరుపై లబ్ధిదారులను అభిప్రాయాలు తెలుసుకుంటు ఆయన ఇంటింటికీ వెళ్లారు. పథకాలు అందలేకపోయిన వారి వివరాలను అడిగి తెలుసుకుంటూ అధికారులను అప్రమత్తం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీకి సంబంధించి బాధితుడు ఎం.శ్రీనివాసరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన శ్రీనివాసరావు ఈనెల 10న జంగారెడ్డిగూడెంలోని కొయ్యలగూడెం రోడ్డులో లారీ ఆఫీసు వద్ద తన మోటార్‌సైకిల్‌ను ఉంచి లోనికి వెళ్లి, తిరిగి వచ్చే సరికి బైక్ అపహరణకు గురైంది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

త్వరలో రహదారి నిర్మాణం

కుక్కునూరు: కుక్కునూరు-బూర్గంపాడు ఆర్ అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని డీఈ సీహెచ్ హరికృష్ణ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. కుక్కునూరు మండల కేంద్రానికి చెందిన అయితా కోటేశ్వరావు 1902 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి రోడ్డు నిర్మాణ పనులపై ఫిర్యాదు చేయడంతో బుధవారం కుక్కునూరు వచ్చిన డీఈ హరికృష్ణ ఫిర్యాదుదారుడిని కలిసి సమస్యను వివరించారు. సాంకేతిక కారణాల వల్ల కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు.

'జగనన్నకు చెబుదాం' కాల్‌పై దర్యాప్తు

కొయ్యలగూడెం: జగనన్నకు చెబుదాం కాల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం బయ్యన్నగూడెంలో విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే బయ్యన్నగూడెంలోని జగనన్న కాలనీ నిర్మాణ ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారని దీనివల్ల తాము ఇబ్బందులు పడుతూ ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నామని ప్రజలు తెలిపారు. మందుబాబులు వీరంగంతోపాటు ఇళ్ల స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్నారని అన్నారు. దీనిపై స్పందన కార్యక్రమంలో ఆరునెలల క్రితం ఫిర్యాదు చేసినట్లు మహిళలు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి జగనన్నకు చెబుదాం ద్వారా మరో మారు ఫిర్యాదు చేశామని అన్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ డిపోకి చెందిన ఎస్సై అబ్దుల్ ఖలీల్, ఏఎం ఆర్.దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి వచ్చి స్వయంగా విచారణ నిర్వహించారు. గతంలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుకు తమ వాంగ్మూలం తీసుకోకుండానే సిబ్బంది ఫిర్యాదు క్లోజ్ చేసినట్లు ప్రజలు అధికారుల వద్ద ఆరోపించారు. ప్రస్తుతం జగనన్న ఇళ్లను నిర్మించుకోలేకపోతున్నామని దీనిపై సంబంధిత శాఖా అధికారులు వెంటనే స్పందించి మద్యం దుకాణాన్ని ప్రజలకు ఏ విధమైన నష్టం కలగని ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. దీనిపై వీఆర్వో తెల్లం గంగారత్నం సమక్షంలో ప్రజల వద్ద నుంచి అధికారులు ఫిర్యాదు స్వీకరించారు. గ్రామస్తులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత మద్దతుగా నిలిచి మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని, ప్రతిష్టాత్మకమైన స్పందనపై వచ్చిన ఫిర్యాదును పక్కదో పట్టించిన ఎక్సైజ్ శాఖలోని అధికారులపై సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, డ్వాక్రా గ్రూపు లీడర్లు, వార్డు మెంబర్లు నక్కా లక్ష్మి ప్రసన్న, తోట విజయలక్ష్మి, దాసరి సుబ్బాయమ్మ, తొంట కృష్ణ, ఉక్కుర్తి నీలయ్య, బాలం సూర్యనారాయణ పాల్గొన్నారు.


బయ్యన్నగూడెంలో జగనన్నకు చెబుదాం కాల్‌పై విచారణ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేత

కొయ్యలగూడెం: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరో ముందడుగు వేసి రైతు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ప్రారంభించిందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. బుధవారం బయ్యనగూడెం ఆర్‌బీకే సెంటర్ వద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు కలిసి పాల్గొన్నారు. ఈ పథకంలో భాగంగా 40 శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు లబ్ధిదారులైన రైతు సంఘాలకు అందించడం జరుగుతుందన్నారు. బయ్యనగూడెంకు చెందిన జై వినాయక, జైశ్రీరామ్ గ్రూపులకు రూ.9.50 లక్షల విలువచేసే ట్రాక్టర్, రోటవేటర్, పవర్ స్ప్రే తదితర సామగ్రిని అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ వీఎస్, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ కోరుకొండ బాపిరాజు, సచివాలయం కన్వీనర్ భవిరిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.


బయ్యనగూడెం ఆర్‌బీకే వద్ద యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్యావరణహిత జీవనశైలితో సత్ఫలితాలు

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితమైన అలవాట్లు చేసుకోవాలని దీంతో సత్ఫలితాలు పొందవచ్చని అటవీశాఖ లాగింగ్ డివిజన్ స్థానిక ప్రభుత్వ వెదురు, టింబర్ డిపో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు వి.భానుప్రకాష్, ఎస్.అరుణ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఏపీ అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలి అనే కార్యక్రమములో భాగంగా స్థానిక అటవీ శాఖ ప్రభుత్వ వెదురు, కలప డిపో సిబ్బంది బుధవారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు మునిసిపల్ పార్క్, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ క్రీడా మైదానాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే వాకింగ్, యోగ, వ్యాయామం కోసం వచ్చే ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు పర్యావరణానికి అనుకూలంగా తమ రోజువారీ అలవాట్లు చేసుకోవాల్సిన అవసరం గుర్తించాలని చెప్పారు. జీవన శైలిలో వీలైన మార్పులు చేసుకోవాలన్నారు. శక్తి, నీటిని ఆదా చేయడం, ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ నిర్మూలన, వ్యర్థాలను తగ్గించుట, ఆరోగ్యకరమైన జీవన విధానం, ఆరోగ్యకరమైన ఆహార విధానం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం వంటి 7 నేపధ్యాలను వివరించారు. పర్యావరణహిత జీవనశైలిపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు గోరింట విజయరామరాజు, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎం.నరసింహరాజు, అల్లూరి సీతారామరాజు పార్క్ వ్యాయామ ఇన్‌చార్జి అల్లూరి రామరాజు పాల్గొన్నారు.


పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజ్యాధికారం కోసం పోరాడండి

కామవరపుకోట: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు రాజ్యాధికారం కోసం పోరాడాలని కోరుతూ మండలంలో రామన్నపాలెంలో చింతలపూడి నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ పల్లి పాము జోసఫ్ తంబి అధ్యక్షతన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహాజన సోషలిస్టు పార్టీ ఏలూరు జిల్లా కన్వీనర్ సనమండ్ర కనకరాజు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన రాజ్య స్థాపనకై గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టామన్నారు. జిల్లా అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్దు మాదిగ మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం కలిసి శ్రమిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు


రామన్నపాలెం సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టానికి చర్యలు

టి.నరసాపురం: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని జెడ్పీటీసీ సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు అన్నారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలోని జెడ్పీటీసీ చాంబర్‌లో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ అనుబంధ సంఘాలకు కన్వీనర్ల నియామకం చేపట్టారు. అన్ని గ్రామపంచాయతీల నుంచి నాయకుల అభిప్రాయాలను క్రోడీకరిస్తూ ఆయా పంచాయతీలకు కేటాయించిన విభాగాల్లో స్థానికుల అభిప్రాయం మేరకు కన్వీనర్ల ఎంపిక నిర్వహించారు. ఎంపిక చేసిన జాబితాను పార్టీ పెద్దలకు పంపించి అక్కడి నుంచి అనుమతి లభించిన తరువాత ప్రకటిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ ఆదేశాలను అనుసరిస్తూ, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, సహకార సంఘాల చైర్మన్లు పిన్నమనేని చక్రవర్తి, దేవరపల్లి ముత్తయ్య, దాసరి రాంబాబు, ఎంపీటీసీలు బండి వెంకట సుబ్బారావు, నార్లపాటి వెంకట్రావు, గాది రాజేంద్రప్రసాద్ రెడ్డి, నాయకులు బొంతు అంజిబాబు, వెలిది నాగబాబు, యర్రా గంగాధరరావు, మండలపు మూర్తి, డి.సూరిబాబు, పులగం వసంతకుమార్‌రెడ్డి, బోళ్ల రంగారావు, తోట రామారావు, కటకం మల్లికార్జునరావు, కన్నం సర్వేశ్వరరావు, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.


టి.నరసాపురంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సామంతపూడి

భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాయండి

బుట్టాయగూడెం: భయాన్ని వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలని ఐటీడీఏ ఇన్‌చార్జీ పీవో జీవీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని నూతిరామన్నపాలెం, రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 10 తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను బుధవారం పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, ఏఎంవో శిరమయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


కొయ్యలగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


జంగారెడ్డిగూడెంలో మానవత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ కొయ్యలగూడెం శాఖ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. కొయ్యలగూడెం చెక్ పోస్ట్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దు గోపి ప్రారంభించారు. మే నెల ఆఖరు వరకు అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో దాహార్తులకు చలివేంద్రం ద్వారా ఉచితంగా మజ్జిగను అందజేస్తామని అధ్యక్ష, కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సంకు కొండ తెలిపారు. రోటరీ క్లబ్ కార్యవర్గాన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముఖ్య అతిథులు వివాహజరైన ప్రభుత్వ శాఖల అధికారులు అభినందించారు. ఎస్‌కే అమీర్ భాష, తోట వెంకటేశ్వరరావు, అడప సత్తిబాబు, మజ్జి సూరిబాబు, దారం సత్తిరాజు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

జంగారెడ్డిగూడెం : మానవత ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. మానవత అధ్యక్షుడు మహంకాళి రంగప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిపో మేనేజర్ గంగాదర్, మానవత సభ్యులు మహంకాళి శ్రీనివాస్, ఏవీరమణమూర్తి, దల్లి రామాంజనేయరెడ్డి, మాథ్యూస్, ఎలికే తాతారావు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో..

టి.నరసాపురం: టి.నరసాపురం మండలం కృష్ణాపురంలో భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్, బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు మజ్జిగ అందజేశారు.దేశావత్ వెంకట్, భూక్యా సత్తిబాబు, జరబల చిన్నారావు, ధరావతు రవి, భూక్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ


కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కుక్కునూరు: పోలవరం డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎ శ్రీనివాసులు బుధవారం కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలాగాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కుక్కునూరు స్టేషన్‌కు మొదటిసారిగా వచ్చిన డీఎస్పీని మండల వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, నాయకులు రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, పోలగాని వెంకట్రావు, అచంట మాధవరావు, సూర్ల రాము, చేబ్రోలు ఫరీద్, బొల్లు ప్రసాద్ తదితరులున్నారు.

గ్రంథాలయంలో నీతి కథల పఠనం

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప విద్యార్థులతో నీతి కథలను బుధవారం చదివించారు. వారితో కథలను చెప్పించారు. తెలంగాణ రాష్ట్ర హుజూర్ జూనియర్ కళాశాల గ్రంథాలయ అధికారి జి.నాగరాజు విద్యార్థులకు చెస్ ప్రాముఖ్యతను వివరించారు. సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం మహాత్మాగాంధీ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తమతో పాటు చదువుకున్న సహచర విద్యార్థికి రూ.17,500 ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. 2002-03 పదో తరగతిలో తమతో చదువుకున్న ఎస్‌కే బేగం సొంత ఇల్లు నిర్మాణానికి అవసరమైన తలుపులతో పాటు నగదును అందజేశారు. పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

వలంటీర్ సేవలు అభినందనీయం

చింతలపూడి: రాఘవాపురం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న పిల్లం రేణుకను పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. వలంటీర్ రేణుక పేదలకు, వృద్ధులకు నిత్యవసర వస్తువులు అందజేస్తూ సేవలందించడం అభినందనీయమని సర్పంచ్ వజ్ర కిషోర్ అన్నారు.కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రకారం పౌష్టికాహారం అందించాలి


బందంచర్ల అంగన్‌వాడీ కేంద్రం-1లో రికార్డులను పరిశీలిస్తున్న గంజిమాల దేవి

టి.నరసాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పౌష్టికాహారాన్ని అందించడంలో లోపాలు గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుంటామని స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ గంజిమాల దేవి అన్నారు. మండలంలోని బందంచర్ల అంగన్‌వాడీ కేంద్రం-1ని చింతలపూడి సీడీపీవో బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం నుంచి పిల్లలకు ఆహారంగా అందించాల్సిన రెండు బస్తాల బియ్యాన్ని అంగన్‌వాడీకేంద్రం నుంచి బయటకు తరలిస్తుండగా, సర్పంచ్ గుండె వెంకటేశ్వరావు, స్థానికులతో కలిసి ఇటీవల అడ్డుకున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు అందడంతో కేంద్రం పనితీరును పరిశీలించేందుకు వచ్చినట్లు ఆమె వివరించారు. 12మంది ప్రీస్కూల్ పిల్లల్లో ఎవరూ హాజరుకాలేదు. చిన్నారుల కోసం వండిన నాణ్యతలేదని, వీటితో పాటు మరికొన్ని లోపాలను గుర్తించామన్నారు. వీటిపై అంగన్‌వాడీ కార్యకర్త ఫణివర్దినికి షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు సీడీపీవో తెలిపారు. వీరి వెంట డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్, వీఆర్వో, మహిళా కానిస్టేబుల్, రేషన్ షాపు డీలర్ ఉన్నారు.

హాల్‌టికెట్ల విడుదల

చింతలపూడి: ఏపీ గురుకుల విద్యాలయాల్లో పాఠశాలల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నిర్వహించే ఏపీఆర్‌ఎస్-సీఏటీ-2023, ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ 2023కు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు నాగిరెడ్డిగూడెం ఏపీ గురుకుల పాఠశాల(బాలికలు) ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌బాబు బుధవారం తెలిపారు. విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీతో వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 20న జరుగుతుందని, కేటాయించిన కేంద్రం వద్దకు పరీక్ష జరిగే సమయానికి ఒక గంట ముందుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 9959666156 నంబరుకు సంప్రదించాలన్నారు.

3న కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలు


చింతలపూడిలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

చింతలపూడి: జూన్ 3న మండలంలోని మల్లాయగూడెంలో తలపెట్టిన కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కౌలు రైతుల సమావేశంలో మహా సభల కరపత్రాన్ని విడుదల చేశారు. కౌలు రైతులంతా మహా సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రావెళ్ళ రాజ్యం, తక్కెళ్ళపాటి ప్రసాద్, టి మాణిక్యాలరావు, సంకుస త్యరాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె గురవయ్య పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్తులకు సరైన చికిత్స అందించాలి


రాఘవాపురం పీహెచ్‌సీలో మానసిక వ్యాధులపై అవగాహన సదస్సు

చింతలపూడి: గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వ్యాధిగ్రస్తులను గుర్తించి సరైన చికిత్స అందించేందుకు కృషి చేయాలని ఏలూరు మానసిక వైద్య విభాగం నిపుణులు ఎల్ తిరుపతి స్వామి విజ్ఞప్తి చేశారు. మండలంలోని రాఘవాపురం పీహెచ్‌సీలో డా. కిరణ్ చైతన్య అధ్యక్షతన బుధవారం మానసిక వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు, ఎంపీహెచ్‌ఈఓలు, ఏఎన్ఎంలు, మానసిక వ్యాధిగ్రస్తులను ఎలా గుర్తించాలన్న విషయంపై పలు సూచనలు చేశారు. మానసిక వ్యాధులు, వాటి లక్షణాలు, చికిత్సా విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు పోరుబాట పట్టాలి

జంగారెడ్డిగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, కార్మికులు పోరుబాట పట్టాలని ఏలూరు జిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద కూనపాముల విగ్నేష్ అధ్యక్షతన ఏఐటీయూసీ ప్రథమ మండల మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతికి 3వ దశ ఉద్యమంలో భాగంగా మే 27న ఏలూరులో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు ఏఐటీయూసీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు అయితా సురేష్, పి.బాలకృష్ణ, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎం.పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నం

చింతలపూడి: చింతంపల్లికి చెందిన బొల్లినేని దుర్గ బుధవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఎస్సై హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం దుర్గ భర్త సునీల్ వేరే మహిళతో ఉంటూ భార్యను వేధింపులకు గురి చేయడంతో ఆమె ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భర్త సునీల్ అతనితో ఉంటున్న మహిళలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

దెందులూరు: అలుగులగూడెంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. బాధిత రైతు చెరుకు ప్రసాద్ మాట్లాడుతూ తమ గేదె నెరుసు అనితకు సంబంధించిన పొలంలో బుధవారం మధ్యాహ్నం ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందన్నారు. ఘటనా స్థలాన్ని విద్యుత్ లైన్‌మెన్ పరిశీలించారు.